కథా నిలయం
3582
శ్రీకాకుళం

# ఓ కౌన్ థీ?

రాత్రి పదకొండయింది. ఇంకో రెండు గంటల్లకు కాని కడప చేరుకోలేం. రాజు త్వరగానే డ్రైవుచేస్తున్నాడు. మొన్నీమధ్యే చేరాడు ఉద్యోగంలో. కుర్రవాడు గనుక జంకుతో జీపునడుపుతాడు. వెనక ట్రయిలరు టప టప మని శబ్దం చేస్తోంది. ముందు సీట్లో కూర్చున్న ఆపరేటరు నారాయణ నిద్రనాపు కోవటానికి శతవిధాల ప్రయత్నిస్తు న్నాడు.

నెల్లూరులో ఎగ్జిబిషను పూర్తయ్యాక తిరుగు మొహం పట్టాము హెడ్ క్వార్టర్సుకు, దారిలో ఓచిన్న పల్లెదగ్గర ఆగి ఫిలిం చూపిద్దామని చెప్పాను.

అప్పుడే నారాయణ అన్నాడు "ఈ రాత్రికి కడప చేరటం కష్టం సార్" అని.

"పర్వాలేదులే, ఆలస్యమయితే ఏమయింది" అన్నాను.

జెనరేటరు సాయంతో ఫిలిం చూపించాము. అంతా సవ్యంగానే ముగిసింది. రాత్రి తొమ్మిదింటికి బయలుదేరాం. ఇంకా ప్రయాణం సాగుతూనే ఉంది.

చీకటి రాత్రి చాలదన్నట్టు వర్షపు చినుకులు మొదలయ్యాయి. ఆ వర్షం కాస్తా పెద్దగా మారింది. వర్షపుజల్లు హోరునగాలి....జీపు టాపు నుండి మెల్లమెల్లగా నీటి బొట్లు పడుతున్నాయి.

"రాజూ దగ్గర్లో వూరేదైనా ఉందా?"

"తెలీదు సార్."

"ఈ ప్రక్కనేవో ఇళ్ళున్నట్టున్నాయి. జీపు ఆపు!" జీపు ఆగింది లైట్ల వెలుగులో కొన్ని గుడిసెలు కనిపించాయి. నారాయణ దిగి వెళ్ళాడు.

ఐదు నిమిషాలల్లో తిరిగి వస్తూ "చాలా చిన్న పల్లెసార్. పది పన్నెండు గుడిసెలకు మించిలేవు. ఒకటో రెండో డాబా ఇళ్ళున్నట్టు న్నాయి" అన్నాడు

నేను దిగి వెళ్ళాను, దారంతా బురద మయం. జాగ్రత్తగా అడుగులేస్తున్నాను. ఎక్కడో కుక్క "భౌయ్" మంది. ఎవరి అలికిడీ లేదు. రావి చెట్టు ఎదురుగా రాళ్ళతో కట్టిన సత్రం ఒకటి శిధిలావస్థలో వుంది. అక్కడే వుండి తెల్లవారిన తర్వాత బయలు దేరుదా మను కొన్నాం. ఆ ధూళిలోనే హోల్డాలు పరిచాను. జీపును చెట్టు క్రిందకు చేర్చి, దానిలోనే కూర్చున్నారు రాజు, నారాయణ.

ఓగంట గడిచిందేమో .... ఎవరో వస్తున్నట్టని పించింది. అప్పుడే నిద్రలోకి జారుతున్న నేను కళ్ళు తెరిచాను. కొవ్వొత్తి చేతిలో పట్టుకు వస్తున్నా రెవరో.

"ఎవరూ" అన్నాను.

అవతలి వ్యక్తి పలకలేదు. దగ్గరగా వచ్చింది ఆకారం....స్త్రీ ఆకారం!

కొవ్వొత్తి తల దగ్గరగాపెట్టి నేలపై కూర్చుంది.

"మీరెవరూ ? ఏం కావాలి ?" అన్నాను.

మెల్లగా నవ్వింది. కాని ఆ మొహం కళాకాంతి లేకుండా పాలి పోయినట్లుంది.

"మీరు రంగనాథం గారేనా? ఫీల్డు పబ్లిసిటీ ఆఫీసరుగా ఉంటు న్నారు కదూ!"

"మీ కెలా తెలుసు ?" పక్క మీదే లేచి కూర్చున్నాను.

"నాకు తెలుసు మీరు నా అభిమాన రచయిత" అంటూ నిట్టూ ర్చింది.

బయట వర్షపుహోరు వినిపిస్తూనే ఉంది. కొవ్వొత్తి గాలికి ఊగు తోంది. నాకు జరుగుతున్నది కలో నిజమో తెలీలేదు.

"అలా ఆశ్చర్యపోకండి. పక్కడాబా ఇల్లేమాది. మీరు చీకట్లో పడుకున్నారని తెలిసి కొవ్వొత్తి తెచ్చాను."

"నే నిక్కడ ఉన్నానని ఎలా తెలుసు?"

"బలే వారండి. జీపు చప్పుడికి మెలుకువ వచ్చింది."

నమ్మాలో అక్కరలేదో తెలీలేదు.

"నమ్మటం లేదు కదూ. పోనీ లెండి. నిజం రేపెలాగూ తెలుస్తుంది. నేనడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పండి."

కళ్ళప్పగించి చూస్తున్నాను.

"మీరిప్పటికి ఎన్ని కథలు వ్రాశారు?"

"గుర్తులేదు. చాలానే వ్రాశాను."

"చాలాఏం. వందకు పైగా వ్రాసి ఉంటారు. అవునా?"

తల ఊపాను.

"నాలుగయిదు నవలలు కూడా వ్రాశారు"

అవునన్నాను.

"మీ రచనలన్నీ నేను చదివాను."

రచయితలకు అంతకంటె కావలసిన దేముంది?

"మీవి చాలా గొప్ప ఆదర్శాలు. చాలా విప్లవాత్మకమైన భావాలు."

నా గుండె గర్వంతో పొంగింది.

"మీకిప్పుడెన్నేళ్ళు?" సడెన్‌గా అడిగిందామె.

"ముప్ఫయి ఐదు."

"పెళ్ళెప్పుడు చేసుకున్నారు?"

"పది, పన్నెండేళ్ళయింది."

"ఆమెను ప్రేమించి పెళ్ళి చేసుకొన్నారా?"

"పెళ్ళయ్యాక ప్రేమగానే చూసుకొంటున్నాను."

"పిల్లలా?"

"ఇద్దరు, పెద్దవాడు మూడోతరగతి, రెండోవాడు కె. జి. లో చేరాడు."

అదోలా నవ్విందామె. "చాలా సుఖంగా ఉన్నారన్నమాటే."

"ఓ మోస్తరు సుఖమనే అనుకోవచ్చు" మోడెస్టుగా జవాబిచ్చాను.

"మీ రచనల్లో ప్రతి ధ్వనించే విప్లవభావాలు ఎవరి కోసం?"

"ఎవరి కోసమేమిటి? సంఘం కోసం. అందరికోసం" ఆవేశంగా జవాబిచ్చాను.

"మీ కథల్లో ఆదర్శ ప్రేమ జొప్పించారు. పతితలను ఉద్ధరించారు. వర్ణాంతర, మతాంతర వివాహాలు, విధవా వివాహాలు జరిపేరు. ఇంచుమించు "ఫ్రీలవ్ సొసైటీ"ని కూడ చిత్రించినట్లున్నారు."

"కాదని నేనలేదే"

"ఆ భావాలన్నీ మీలో జీర్ణించుకు పోయాయని, ఎలాంటి పరిస్థితులనైనా ప్రతిఘటించ గలరని నమ్మమంటారా?"

నేనేం జవాబు చెప్పలేదు.

"ఇప్పుడో అనాధ, సంఘంచేత "ఛీ" అనిపించుకున్న వ్యక్తి మీ ఆశ్రయం కోరితే ఇస్తారా?"

"ఎవరా వ్యక్తి?"

"నేను."

స్తబ్ధుణ్ణయ్యాను.

"ఏం జవాబురాదే? మీ భార్య అనుమానిస్తుందని భయమా?"

"ఛా! సరోజకు నామీద పూర్తి విశ్వాసం."

"మరి....సంఘానికి ఏం సమాధాన మివ్వాలో తెలీదా?"

"అసలు విషయం తెలియనిదే నేనేమీ చెప్పలేను."

"ఓహో అంతా విని, అట్టే పరువు పోదనుకుంటే ఆశ్రయమిస్తారన్న మాట. లేకపోతే మీదేం పోయింది దీన్ని గురించి చక్కగా ఓ కథ వ్రాసేస్తారు."

"మీరు ఆవేశపడకండి. అసలు విషయం చెబితే మీకేమయినా సహాయం చేయగలను."

"అందరి సహాయమూ అయిపోయింది" అని పేలవంగా నవ్విందామె.

"మా నాన్నగారు ఈ ఊరికంతా ధనవంతుడు. అందుకే నన్ను కాలేజీ చదువులకు పంపిచారు. చిన్నప్పటి నుండి కథలు చదవటం ఇష్టం. మీ రచనలు హైస్కూలు రోజుల్లోనే చదవటం మొదలుబెట్టాను. అప్పటికే మిమ్మల్ని ఉన్నతులుగా ఊహించు కున్నాను. మీ

రచనలన్నీ చదివేదాన్ని, మీరే నా ఆలోచనా స్రవంతిని మళ్ళించారు. నావ్యక్తిత్వానికి రూపుదిద్దారు. నేను మీకుతెలీదుగాని మీరు నా ఆత్మీయులుగా నా భావనలో నిలిచిపోయారు"

తనను అంత ప్రభావితను చేశానంటే నా కెంతో ఆనంద మనిపించింది.

"ఇంతా చేసి ఏమయిందనుకున్నారు? మీవిశాల భావాలు నా నరనరాలఎక్కించేశారా? ఇంకేం. లోకమంతా అలాగే వుందను కున్నాను. ప్రేమ వివాహాలు చాలా సాధారణంగా జరుగుతాయని, అదో ఆదర్శమని భావించాను. నాకు నచ్చిన వ్యక్తిని కుల ప్రమేయం లేకుండా పెళ్ళి చేసుకోవచ్చనను కున్నాను.

"తండ్రిగారికి ఈ విషయం తెలిసి కోప్పడ్డారు. చదువు చాలించి ఇంటికి రమ్మన్నారు. ఆదర్శ ప్రేమ ప్రతి రక్తకణంలో నిండిందాయె. అందుకే నేనారాధించిన వ్యక్తి దగ్గరకు వెళ్ళి స్థానం కలిగించమని అడిగాను.

"సంఘాన్ని ఎదిరించి ఎలా?" అన్నాడతను.

"సంఘం ఏమిటి? మన చుట్టూ ఉన్న మనుషులేనా? అయినా వాళ్ళు మన కన్నీళ్ళు తుడుస్తారా? కష్టాల్లో పాలుపంచుకుంటారా? ఆ దురాచారాలు రూపు మాపడానికి ఎవరో ఒకరు సాహసం చెయ్యొద్దూ" అన్నాను.

"ఆ మాటలన్నీ కథల్లో! జీవితం వేరు" అన్నాడు ఆ ప్రేమ మూర్తి.

"నాన్నగారితో పాటు ఇంటికివచ్చాను. ఊళ్ళో అప్పటికే పుకార్లు. ఏదో పతితను చూసినట్లు చూస్తున్నారందరూ. నేను మాత్రం అసహజంగా ఏం చేశానని?"

ఆమె కాస్సేపు మౌనంగా కదుగుతున్న కొవ్వొత్తికేసి చూస్తూ కూర్చుంది. నేనూ ఏమీ మాట్లాడలేదు. తనే మొదలు పెట్టింది.

"నాన్నగారు ఓసంబంధం తెచ్చారు. పదివేల కట్నంతో కష్టం మీద కుదిర్చారట."

"కట్నం తీసుకున్నవాడిని అసలు పెళ్లి చేసుకోను" అన్నాను స్థిరంగా.

"నీ ఇష్టప్రకారం చేసి మా పరువు గంగలో కలిపావు. ఇకనైనా నోరు మూసుకుని పెద్దలు చెప్పినట్లు విను" అన్నారు తీవ్రంగా.

ధైర్యంచేసి పెళ్లికొడుకునే అడిగాను.

"కట్నం తీసుకోవడమేమిటి? నిర్మలంగా నన్నునేను అర్పించుకుంటాను చాలదా?" అని.

"ఎక్కడో పుస్తకాల్లో మాటలు మాట్లాడుతున్నారే. మాకుటుంబ గౌరవం కోసం కట్నం తీసుకోవద్దూ" అన్నాడతను.

అంత ధైర్యంగా అతన్ని అడిగానని తెలిసి "ఛీ, ఛీ ఎంత తెగించింది" అన్నారందరూ. కట్నాల సమస్య తీరటానికి అమ్మాయిలే ముందంజ వేయాలని మీ పుస్తకాల్లో చెప్పారు మరి.

పెళ్లి ఆడంబరంగా జరుపవద్దన్నాను.

"దేశంలో అన్నార్తులెందరో వుండగా ఇన్ని వేలు ఖర్చు అనవసరంగా పెట్టటం పాపంకాదా" అన్నాను.

"ఇదెక్కడిపిల్ల. తులసి తోటలో గంజాయి మొక్కలా ఆచారాలు మంటగలుపుతానంటుంది. నువ్వారుకో తల్లీ మమ్మల్ని యిలా బ్రతకనియ్యి" అని విసుక్కుంది అమ్మ.

అన్ని సంఘటనలూ నా ఆదర్శాల మీద దెబ్బకొట్టాయి. సంసార జీవితంలో ఆయన దర్పం నాకు అర్థం కాలేదు. జీవన సహచరుల గురించి మీరు వ్రాసింది, నేను ఊహించినదీ అంతా అబద్ధమయింది. తన అధికారానికి, అహంభావానికి నేను బానిస కావల్సివచ్చింది. ఆదర్శ దాంపత్యం గురించి ఆయనకు చెప్పబోతే నా చెంప ఛల్‌మంది.

"నోరుముయ్. నాలుగక్షరాలు నేర్చుకోగానే ఎక్కడలేని చిలక పలుకులు పలుకుతున్నావు. ఆడదానికి అంత దురుసుతనం పనికిరాదు. ఆ పుస్తకాలు నిప్పులో వేస్తేగాని నీ తిక్క కుదరదు" అని ప్రాణానికి ప్రాణమైన పుస్తకాల్ని నా ఎదుటనే నిప్పుల్లో వేశారు.

ఆ నరకం నుండి తప్పించుకుని ఇంటికివస్తే ఊరడింపు లేకపోగా "భర్తను వదిలేసింద"ని అందరూ నీచంగా మాట్లాడేరు. కాని మీ పుస్తకాల్లో ఆత్మగౌరవం గల ఏ యువతీ భర్తకు బానిస కాలేదు. బలవంతాన నన్నక్కడికి మరల పంపే ప్రయత్నాలు చేశారు. దానితో నా జీవితం ముగించుకోవాలని పించింది" ఆమె చెక్కిళ్ళమీద నీరు ధారగా కారుతోంది.

నిస్సహాయంగా ఆమెకేసి చూస్తూకూర్చున్నాను.

"దీనికంతా....నా జీవితం యిలా భగ్గుమని మండటానికి ఎవరు బాధ్యులు?"

"సంఘం" ఆవేశంగా అన్నాను.

"మనుషులు మారాలి, మనస్తత్వాలు మారాలి...."

"చాలించండి"

నివ్వెరపోయి చూశాను.

"నా జీవితం ఇలా బూడిదయిపోవటానికి కారణం, నా కన్నీటికి, గుండె మంటకు కారణం....నాలాంటి ఎందరో అభాగ్యుల దురదృష్టానికి కారణం మీరు"

"నేనా? నేనేం చేశాను?"

"అవును. మీరే. మీలాంటి రచయితలే. సంఘం, ప్రపంచం వున్నది. ఒక తీరునయితే మీరు సృష్టించే లోకం ఇంకోలా వుంటుంది. మీ ఆదర్శాలు, విప్లవాత్మక భావాలు పాత్రల్లో జొప్పించి మీ నైపుణ్యంతో "శభాష్" అనిపిస్తారు. కాని అవన్నీ వంట బట్టించుకున్న నా లాంటి దురదృష్టవంతులు జీవితంలో అడుగడుగునా ఎదురు దెబ్బలు తింటారు. మీ రచనల మూలంగా సంఘంలో ఇమడలేక, జీవితంతో సామరస్యం కుదుర్చుకోలేక, విలవిలలాడి పోతున్నారు చాలమంది"

"మార్పు ఎలా వస్తుంది? కొన్ని వందల సంవత్సరాలకు...."

"అవును. అంతవరకు మూగ జీవులం యిలా బలి అవుతూ వుంటాం. మీ రచయితలందరూ కడుపులో చల్ల కదలకుండా ఆదర్శ వాదాలు వదలండి!"

"అంటే...."

"అంటే ఇందు మూలంగా మీకేం నష్టం లేదు. సంఘంలో మీ పరువు ప్రతిష్టలకు లోటులేదు. పైపెచ్చు రచయితగా కీర్తి గడించుకుంటారు. పదేళ్ళ క్రితమే పెద్దలు తెచ్చిన సంబంధం చేసుకుని సంసారం నిర్మలంగా సాగిస్తూ కులాంతర మతాంతర వివాహాలు, ఆదర్శ ప్రేమ వివాహాలు అంటూ రచనలు చేస్తారు. ఇతరులని మీ ఆదర్శాలకు బలి చేస్తున్నారు. ఆచరణలో పెట్టలేని మీ ఆదర్శాలు ఎందుకు? కాల్చనా?"

"అయితే మేము వ్రాసే ప్రతి సూత్రమూ ఆచరణలో ఎలా పెట్టగలం?"

"అవును పాపం. ఎలా పెట్టగలరు? కడుపునిండుగా, తిని ఆకలి బాధను గురించి వ్యాసాలు వ్రాసేరకం మీరు. అయినా మీదేంపోయింది? బాధపడేది మీరు కాదుగా."

ఎక్కడో కోడి కూసింది.

ఆమె లేచి నిల్చుంది.

"అరె వెళ్ళిపోతున్నారే. మిమ్మల్ని తప్పక నాతో తీసుకెళ్తాను."

హేళనగా ఓ చిరునవ్వు మెరిసింది ఆమె పెదవులపై. "వొద్దొద్దు. పాపం. కళంకం లేని జీవితంలో ఇంత పెద్ద అపవాదు భరిస్తారా? నిజంగా సంఘాన్ని ఎదుర్కోవటమంటే పుస్తకాల్లో రాసినంత తేలిక కాదని మీకు తెలిసట్లుంది."

గాలి గట్టిగా వీచింది.

కొవ్వొత్తి ఆరిపోయింది.

ఆమె వెళ్ళిపోయింది.

ఆ మిగిలిన రాత్రి ఆమె గురించి ఆలోచిస్తున్నా. నా భావనలు పరుగెత్తినట్లల్లా నా పాత్రలు సృష్టించాను. అగ్నిపరీక్షల్లో నెగ్గేలా చేశాను. భావస్వాతంత్ర్యము ఆ కావ్యస్వాతంత్ర్యము పాత్రల్లో అణువణువునా ప్రవహించేలా చేశాను. ఆమె చెప్పింది నిజమే. నా జీవితంలో హాయిగాస్థిరపడి విప్లవాత్మకమైనకథలు వ్రాయటం మొదలు బెట్టాను....

౬౫

నారాయణ రాక నా ఆలోచనలకు అంతరాయం కలిగించింది.

"సార్. కాఫీ దొరుకుతుందేమో కనుక్కుంటాను. మీరు మొహం కడుక్కురండి."

టవలు తీసుకు బయలుదేరాను జీపు చుట్టూ చింపిరిగా, మురిగ్గా వున్న పిల్లలు చేరి గొడవచేస్తున్నారు. రాజు వాళ్ళని దూరంగా వెళ్ళ మంటున్నాడు.

"చెరువెక్కడ?" అని అడిగాను ఎదురుగా నీళ్ళకావిడి తెస్తున్న వ్యక్తిని.

"చెరువులో నీళ్ళు మంచియి కాదయ్యా" అన్నాడతను. "ఈడనే బాయుంది. ఆ మలుపు దగ్గర మొఖం కడుక్కోండి." అని మలుపు కేసి చేయి చూపించాడు.

"చెరువు నీళ్ళు వాడుకోరేమిటి?" అన్నాను.

"వాడకేం దొరా. మొన్నటి దాకా తాగే నీళ్ళూ అవే. కాని మా పెద్దకాపు కూతురు చెర్లోపడింది ఆ నీళ్ళు ఇడిసిపెట్టేశాం."

"ఎవరూ చెర్లో పడింది. ఎప్పుడు?"

"నిన్న ఉదయాన నీళ్ళకావిడేసుకుపోతే ఆయమ్మ తెలుతూ కనిపించింది. ఎప్పుడు దూకిందో ఏమో. ఆ సత్రం పక్క మిద్దింటి మారాజు కూతురు. పట్నం సదువు సదివించి లచ్చనంగా లగ్నం చేస్తే మొగుణ్ణొదిలొచ్చి చెర్లో దూకిందాతల్లి. ఏందో వున్న మారాజులట్లా, లేనోళ్ళు ఇట్లా" అన్నాడు సాగిపోతూ.

మరి రాత్రి నాకు వచ్చింది కలా! సత్రానికి వెళ్ళగానే చూశాను. సగం కాలిన కొవ్వొత్తి అలాగే వుంది.

ఆ పెదకాపుగారికి వేరే కూతుళ్ళెవరూ లేరని వాకబు చేస్తే తెలిసింది.

మరి నేను చూసింది, మాట్లాడింది ఎవరితో? ఆమె ఎవరు?